సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 8 । జనవరి । 2024



సారూ.. జీతాలు వస్తలెవ్!
సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు రెండు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించాలని వారు కోరుతున్నారు. 8లో▸



నిలిచిన వంతెన పనులు
బేల మండలంలోని దుబ్బగూడ(ఎస్) శివారులో గల వాగుపై రూ.3కోట్ల వ్యయంతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

గురుకృప దినోత్సవానికి కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఆహ్వానిస్తున్న జెడ్పీచైర్మన్ జనార్దన్ తదితరులు

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలో గల జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద ఈ నెల 11న నిర్వహించే గురుకృప దినోత్సవానికి రావాల్సిందిగా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆహ్వానించారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి ఆహ్వానించినట్లు కమిటీ అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్ తెలిపారు. అలాగే జెడ్పీ సీఈవో గణపతి, డిప్యూటీ సీఈవో రాథోడ్ రాజేశ్వర్, అదనపు డీఆర్డీవో రాథోడ్ రవీందర్‌ను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ప్రతీతండా నుంచి భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు నారాయణ్‌నాయక్, పవార్ దేవిదాస్, సభ్యులు రాథోడ్ రమేశ్, నరహరి రాథోడ్ తదితరులున్నారు.

‘బోథ్ డివిజన్’ పరిశీలించండి



మంత్రి పొంగులేటిని కలిసిన అరుణ్‌కుమార్

బోథ్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ ప్రాంతవాసుల చిరకాల వాంఛ అయిన రెవెన్యూ డివిజన్ చేయాలని మంత్రిని కోరారు. సీఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

వేలిముద్రలు పడని వారి ఐరిస్ సేకరించాలి


కైలాస్‌నగర్: జిల్లాలోని రేషన్‌డీలర్లు ఆయా రేషన్ కార్డుల్లో గల సభ్యుల ఈకేవైసీ నమోదు చేసే క్రమంలో వేలిముద్రలు పడని వారి ఐరిస్ (కను పాప) ప్రామాణీకరణ చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి టి.కిరణ్ కుమార్ ప్రకటనలో తెలిపారు. కార్డుదారులు ఆధార్ అప్‌డేట్ చేసుకున్న పది రోజుల తర్వాత ఈకేవైసీ వివరాల నమోదుకు ప్రయత్నించాలని పేర్కొన్నారు. ఐరిస్, వేలి ముద్రలు పడనటువంటి ప్రతి సభ్యుని సమగ్ర సమాచారాన్ని ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. సభ్యుని పేరు, ఆధార్ నంబర్, రేషన్‌కార్డు నంబర్, మొబైల్ నంబర్ , గ్రామం, వయసు వంటి వివరాలన్నింటిని నమోదు చేసి ఉంచాలని పేర్కొన్నారు. అలాగే రేషన్‌షాపు పరిధిలో మరణించిన వారి వివరాలు సైతం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విదేశాల్లో ఉన్న కార్డుసభ్యుల పేర్లను ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ సమాచారంతో కూడిన వివరాలు నమోదు చేసినట్లైతే ఈకేవైసీ నమోదు కాకుండా మిగిలిన వారి వివరాలను ప్రభుత్వానికిఅందించే అవకాశముంటుందని పేర్కొన్నారు. డీలర్లు విషయాన్ని గమనించాలని సూచించారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్.విలాస్

ఎదులాపురం: సెంట్రల్ వేర్‌హౌస్ కార్పొరేషన్ హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సీడబ్ల్యూసీ హమాలీలకు నేరుగా అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని, అలాగే ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఇందులో సీడబ్ల్యూసీ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్, వసంత్, హుస్సేన్, అబ్రార్ తదితరులున్నారు.



‘మెగా’ ఆశలు

ఆదిలాబాద్‌టౌన్: కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మెగా డీఎస్సీ ఉంటుందని ప్రకటించడంతో నిరుద్యోగులు గంపెడాశలు పెట్టుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి 2017లో మాత్రమే ఉపాధ్యాయ నియామక ప్రక్రియ చేపట్టారు. అప్పటి నుంచి నోటిఫికేషన్ లేకుండా పోయింది. దీంతో బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు టీచర్ కొలువు కోసం గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. ఓ వైపు సర్కారు పాఠశాలల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందడం లేదు. ఉన్నత తరగతులకు బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో ఎస్జీటీలతోనే సర్దుబాటు చేస్తున్నారు. దీంతో ఇటు ప్రాథమిక, అటు ఉన్నత తరగతుల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం సెప్టెంబర్‌లో డీఎస్సీ ప్రకటన చేసింది. అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. అయితే ఎన్నికల కోడ్ కారణంగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఫిబ్రవరిలో డీఎస్సీ రాత పరీక్ష జరగాల్సి ఉండగా, కొత్త ప్రభుత్వం మరిన్ని పోస్టుల భర్తీకి చర్యలు చేపడతుందని ప్రకటించడంతో అభ్యర్థుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

నిరుద్యోగులకు మేలు..
సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో మూతబడిన పాఠశాలలను తెరిపించాలని, ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామని ప్రకటించారు. మెగా డీఎస్సీ వేయనున్నట్లు తెలిపారు. అయితే గత ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో 275 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో 54 స్కూల్ అసిస్టెంట్, 206 ఎస్జీటీ, 13 భాషా పండిత, 2 పీఈటీ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం మరో 22 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు పెరిగాయి. ఎస్జీటీ పదోన్నతులు నిలిచిపోయాయి. ఈ ప్రక్రియ పూర్తయితే మరో 250 వరకు పోస్టులు పెరగనున్నాయి. దాదాపు 500 వరకు ఎస్జీటీలు, 76 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతోపాటు మార్చి నుంచి ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ ప్రక్రియ ప్రారంభం కానుంది. గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు రెండేళ్ల పాటు సర్వీస్ పొడిగించిన విషయం తెలిసిందే. 2024లో 61 మంది ఎస్జీటీ, భాషా పండితులు, స్కూల్ అసిస్టెంట్లు, 16 మంది పీజీ హెచ్‌ఎంలు ఉద్యోగ విరమణ చేయనున్నారు. అప్పటివరకు నోటిఫికేషన్ జారీ అయితే మరిన్ని పోస్టులు పెరిగే అవకాశం లేకపోలేదు.

నోటిఫికేషన్ కోసం ఎదురుచూపు..
నిరుద్యోగులు ఉపాధ్యాయ కొలువు కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం 2017లో డీఎస్సీ నోటిఫికేషన్ వేయగా, 2020 వరకు ఆ పోస్టులను భర్తీ చేసింది. ఆ తర్వాత పలుసార్లు నోటిఫికేషన్ జారీ చేస్తామని ప్రకటించినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఎన్నికల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించినప్పటికీ ప్రక్రియ అర్ధంతరంగా నిలిచిపోయింది. నోటిఫికేషన్ జారీ చేస్తామని ప్రకటించిన ప్రతీసారి నిరుద్యోగులు కోచింగ్ సెంటర్ల వైపు పరుగు తీస్తున్నారు. పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. అయినప్పటికీ వారి కల నెరవేరడం లేదు. కొత్త ప్రభుత్వంలోనైనా ఈ ప్రక్రియ పూర్తి చేస్తే కొలువు సాధిస్తామనే ధీమాతో నిరుద్యోగులు ఉన్నారు.

జిల్లాలో ప్రస్తుతం ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల వివరాలు

విభాగం	ఖాళీ పోస్టులు
స్కూల్ అసిస్టెంట్	76
ఎస్జీటీ	206
భాషా పండిత్	13
పీఈటీ	02
మొత్తం	297

పోస్టుల ఖాళీలతో అవస్థలు..
జిల్లాలో డీఈవో పరిధిలో 698 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 3,028 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు ఉండగా, ప్రస్తుతం 2,482 మంది పనిచేస్తున్నారు. 546 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 80 పాఠశాలల్లో ఏకోపాధ్యాయులతో తరగతులు సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల కొరత కారణంగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న 150 మందిని సర్దుబాటు చేశారు. దీంతో ప్రాథమిక విద్యావ్యవస్థ కుంటుపడుతుంది. గతేడాది నిర్వహించిన సర్వేలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 50 శాతం కంటే తక్కువ మంది విద్యార్థులకు చదవడం, రాయడం రాదని తేలింది. ఆ తర్వాత ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి కనీస సామర్థ్యాలు పెంచారు. ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితి. పోస్టులు భర్తీ చేస్తే తప్ప విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి నోచుకోని పరిస్థితి.

ప్రభుత్వానికి నివేదించాం..



జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను డీఎస్ఈకి పంపించాం. 297 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత ప్రభుత్వం డీఎస్సీకి సంబంధించి 275 పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఎస్జీటీల పదోన్నతులు కోర్టు కేసు కారణంగా నిలిచిపోయాయి. ఆ ప్రక్రియ పూర్తయితే మరిన్ని పోస్టులు పెరిగే అవకాశం ఉంది. – టి.ప్రణీత, డీఈవో

రిమ్స్‌లో మరిన్ని సేవలు..



ఈఎస్‌డబ్ల్యూఎల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్

- ఎంపీ సోయం బాపూరావు
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈఎస్‌డబ్ల్యూఎల్ ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని, కార్పొరేట్‌కు దీటుగా అందించేలా చర్యలు చేపడతామని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎక్స్‌ట్రాకార్పోరియల్ షాక్‌వేవ్ లిథోట్రిప్సీ (ఈఎస్‌డబ్ల్యూఎస్) పరికరంను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కిడ్నీలో స్టోన్స్‌తో బాధపడుతున్న వారికి ఎలాంటి ఆపరేషన్ లేకుండా, నొప్పి తెలియకుండా ఈ యంత్రం ద్వారా వాటిని తొలగించవచ్చన్నారు. రూ.4 కోట్లతో ఈ పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిమ్స్‌లో వైద్యుల కొరత కారణంగా ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్లపై కొంత పనిభారం పెరిగినప్పటికీ పేదలకు సేవలు అందించాలని కోరారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు, నెలకొన్న సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు కార్తీక్, కళ్యాణ్ రెడ్డి, దేవిదాస్, బీజేపీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

కైలాస్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పాత, కొత్త తేడా లేకుండా పార్టీ గెలుపుకోసం కలిసి కట్టుగా పనిచేద్దామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇటీవల పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరిన డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి– వెంకట్‌రెడ్డి, పూసాయి సర్పంచ్ అల్లూరి పోతారెడ్డి తదితర నాయకులు ఆదివారం కంది క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. వారి చేరికపై హర్షం వ్యక్తం చేసిన ఆయన వారిని శాలువాలతో సత్కరించారు. సీనియర్ నాయకులు కాంగ్రెస్‌లోకి రావడం సంతోషంగా ఉందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆశించిన అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీ హామీలు అమలు చేసి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్‌లో చేరినట్లుగా భోజారెడ్డి తెలిపారు. తిరిగి తన సొంత గూటికి రా వడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ బలోపేతం కో సం శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో నాయకులు దశరథ్, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, గడ్డం పోతారెడ్డి, కృష్ణరెడ్డి, మోహిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



భోజారెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి

అనుసంధానమెప్పుడో..!?

- ‘ఉపాధి’ని సాగుకు అనుసంధానిస్తేనే రైతన్నకు మేలు
- ఏటా వెంటాడుతున్న కూలీల కొరత
- అన్నదాతపై పెరుగుతున్న పెట్టుబడి భారం

బోథ్: ఆరుగాలం శ్రమిస్తూ దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ఏటా సాగు కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా ప్రతీ సీజన్‌లో కూలీల కొరత వెంటాడుతోంది. ఇది పెట్టుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలంటూ రైతు సంఘాలు ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వాలకు విన్నవించాయి. నీతి ఆయోగ్ సైతం అనుసంధానమే అన్నదాతకు మేలంటూ తన నివేదికలో పేర్కొంది. అయినా ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోకపోవడంతో సర్కారుపై రైతన్నల ఆశలు సన్నగిల్లుతున్నాయి.


రైతులపై మోయలేని భారం..
వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకం అనుసంధానం చేస్తే రైతులకు 30శాతం మేలు చేకూరుతుందని మేధావులు, రాజకీయ అనుభవజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు. కూలీల కొరత అధిగమించడంతో పాటు రైతులు అనేక రకాల పంటలు పండించేందుకు వీలు కలుగుతుంది. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణమే అధికం. పంట చేతికి వచ్చిన తరువాత పత్తి ఏరేందుకు కూలీల కొరత సమస్య ఏటా వెంటాడుతూనే ఉంది. ఈ క్రమంలో కూలి పెంపు తప్పనిసరవుతోంది. కూలీలను పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి ఆటోలు, జీపుల్లో తీసుకురావాల్సిన దుస్థితి. వారికి కూలితో పాటు రానుపోను చార్జీలు సైతం రైతులే చెల్లించాల్సి వస్తోంది. అన్నదాతపై పెట్టుబడి భారం పెరుగుతోంది. మరో వైపు గిట్టుబాటు ధర అందకపోవడం, తేమ పేరిట కోతలు ఏటా పరిపాటిగా మారాయి. దీంతో పత్తి రైతుకు ఏటా తిప్పలు తప్పట్లేదు.

‘ఉపాధి’ని అనుసంధానిస్తే ఇలా..
ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానిస్తే రైతులకు మేలు జరుగుతుంది. విత్తనాలు వేయడం, పత్తి ఏరడం, పంట సాగులో ఇతరత్రా పనులకు ఉపాధి కూలీలను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. కూలీలకు సైతం ఏడాది పాటు ఉపాధి దొరుకుతుంది. ఇప్పటికే ఈ పథకం ద్వారా వ్యవసాయంలో పలు పనులు చేర్చారు. పూర్తిస్థాయిలో అనుసంధానిస్తే ఇటు రైతులకు, అటు కూలీలకు లాభం చేకూరుతుంది.



పత్తి ఏరుతున్న కూలీలు (ఫైల్)

కూలీల కొరత తీవ్రంగా ఉంది



ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగా ఉంది. పత్తి తీయడం ఇబ్బందవుతుంది. దీంతో పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి కూలీలను తీసుకువస్తున్నాం. వారు రావడానికి, తిరిగి వెళ్లడానికి ఆటో చార్జీలు సైతం చెల్లిస్తున్నాం. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానిస్తే కూలీల కొరత ఉండదు. రైతులకు మేలు జరుగుతుంది. – సూర్యం, బోథ్

- ‘గృహలక్ష్మి’ని రద్దు చేసిన ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇళ్లకు ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
- లబ్ధి కోసం అర్హుల ఎదురుచూపు

65,827 దరఖాస్తులు బుట్టదాఖలు

కైలాస్‌నగర్: ఇంటి స్థలం కలిగి ఉండి పక్కా ఇళ్లు నిర్మించుకోవాలనుకునే నిరుపేదలకు రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని రేవంత్‌రెడ్డి సర్కారు రద్దు చేసింది. ఇందు కోసం స్వీకరించిన దరఖాస్తులన్నింటిని పక్కనపెట్టాలని జిల్లా కలెక్టర్లను ఆదేశిస్తూ ఈ నెల 3న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో ఈ పథకం కోసం అందిన 65,827 దరఖాస్తులు బుట్టదాఖలయ్యాయి. దీనిపై దరఖాస్తుదారుల్లో నిరాశ వ్యక్తమవుతున్నప్పటికీ బీఆర్ఎస్ ప్రకటించిన రూ.3లక్షలకు మరో రూ.2లక్షలు కలిపి రూ.5లక్షల సాయాన్ని ఇంటి నిర్మాణం కోసం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం ఊరటనిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై అర్హులైన వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే విధి విధానాలపై ఇప్పటి వరకు స్పష్టత లేకపోవడం గమనార్హం. తాజాగా ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం స్వీకరించిన దరఖాస్తులను ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వాటి ఆధారంగా అర్హుల ఎంపికకు సంబంధించి విధి విధానాలు ఖరారయ్యే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

మంజూరు కాకుండానే రద్దు..
2018 ఎన్నికల్లో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సర్కారు అర్హులైన వారందరికి డబుల్ బెడ్ రూం నిర్మించి ఇస్తామని ప్రకటించింది. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినప్పటికీ బిల్లుల జాప్యం కారణంగా వాటిని చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. దీంతో కొన్నిచోట్ల పనులు అర్ధంతరంగా నిలిచిపోగా, పలుచోట్ల అసలు నిర్మాణాలనే చేపట్టలేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 ఎన్నికలకు ముందు సొంత ఇంటి స్థలం కలిగి ఉన్న పేదలకు రూ.3లక్షల ఆర్థికసాయం అందించేలా గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. గతేడాది ఆగస్టులో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా వేలల్లో దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయి విచారణ అనంతరం అధికారులు 46,732 మందిని అర్హులుగా తేల్చారు. వీరిలో నుంచి జిల్లాకు కేటాయించిన 7,400 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన తరుణంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారిపోవడంతో ఇళ్లను మంజూరు చేయకుండానే ఈ పథకం రద్దయింది.

ఇందిరమ్మ ఇళ్లపై గంపెడాశలు
గృహలక్ష్మి దరఖాస్తులను రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేలా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు రూ.5లక్షల సాయం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. తదనుగుణంగా గత నెల 28 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు సాగిన ప్రజాపాలనలో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఎనిమిది రోజుల పాటు అందిన దరఖాస్తులను ప్రస్తుతం ప్రజాపాలన అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. విధి విధానాలు ఇంకా ఖరారు కానప్పటికీ సోమవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఓ స్పష్టత వచ్చే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే ఏ ప్రతిపాదికన లబ్ధిదారులను ఎంపిక చేస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రెంటికి చెడ్డ రేవడిలా పేదల పరిస్థితి
గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలకు అప్పజెప్పింది. దీంతో నేరుగా ఎమ్మెల్యేలను కలువలేకపోయిన ఎంతో మంది నిరుపేదలు వారి అనుయాయులుగా ఉన్న ఆ పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులను ఆశ్రయించారు. తమకు ఎలాగైన ఇళ్లను మంజూరు చేయించాలని కోరుతూ రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ముట్టజెప్పారనే ఆరోపణలున్నాయి. దరఖాస్తుదారుల నుంచి పైరవీలు ఎక్కువగా జరిగి వారికి రూ.లక్షలను ముట్టజెప్పాల్సి వచ్చింది. తీరా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తామిచ్చిన డబ్బులు తిరిగివ్వమని కోరితే బీఆర్ఎస్ నాయకులు ముఖం చాటేస్తున్నారు. కాగా గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేయడంతో పేదలు రెండు విధాలా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడటంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



క్షేత్రస్థాయిలో ‘గృహలక్ష్మి’ దరఖాస్తులను విచారిస్తున్న పంచాయతీ కార్యదర్శి (ఫైల్)

మేడిగూడలో కార్డన్‌సెర్చ్

నార్నూర్: గాదిగూడ మండలంలోని మేడిగూడలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐ, ఇద్దరు ఎస్సైలు, పోలీసు సిబ్బంది కలిసి ఉదయాన్నే గ్రామంలో ఇంటింటి తనిఖీలు చేపట్టారు. గుడుంబా తయారు చేస్తున్న గుల్వే రాహుల్ నుంచి 10 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 53 బైక్‌లు, 12 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ నాగేందర్ తెలిపారు. అనంతరం గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ప్రేంకుమార్, నార్నూర్ ఎస్సై రవికిరణ్, గాదిగూడ ఎస్సై మహేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

కరాటే గ్రేడింగ్ పరీక్షలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బోధి బుడోఖాన్ కరాటే సీనియర్ మాస్టర్ కాంబ్లే ముఖేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. 180 మంది విద్యార్థులు హాజరవగా.. 66 మంది ఎల్లోబెల్ట్, 37 మంది ఆరెంజ్ బెల్ట్, 24 మంది గ్రీన్ బెల్ట్, 18 మంది బ్లూబెల్ట్, 16 మంది పర్పుల్ బెల్ట్, 19మంది బ్రౌన్‌బెల్ట్ సాధించారు. సీనియర్ మాస్టర్లు దేవిదాస్, రాము, ఆకాష్, ప్రేమ్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్స్ సంధ్య, రాహుల్, సునీత, అంజు, అనుష్క తదితరులు పాల్గొన్నారు.



ఆయా బెల్ట్‌లు సాధించిన క్రీడాకారులు

క్లుప్తంగా

'13న సమావేశం విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న ఆర్క ఖమ్ము

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఈ నెల 13న నిర్వహించనున్న ఆదివాసీ ప్రధాన్ పురోహిత్ సంఘం ఉమ్మడి జిల్లా సమావేశం విజయవంతం చేయాలని సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఆర్క ఖమ్ము అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 24న గోండి ధర్మగురు హీరసుక జయంతి వేడుకల నిర్వహణపై 13న మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశానికి ఆదివాసీ ప్రధాన్ పురోహిత్ సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, విద్యావంతులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన్‌గూడ గ్రామ పటేల్ గేడం జ్ఞానేశ్వర్, సమాజ్ పెద్దలు మడావి విశ్వనాథ్, మరప రాజు, సంఘం డివిజన్ గౌరవ అధ్యక్షుడు సోయం రాందాస్, గ్రామస్తులు గేడం భరత్, మడావి దత్తు, కనకభీంరావ్, కుమ్ర భీంరావ్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ వాల్వ్‌లు మాయం

బోథ్: మండలంలోని సొనాలలో డంపింగ్ యార్డులో ఉన్న మిషన్ భగీరథ వాల్వ్‌లు మాయమయ్యాయి. మిషన్ భగీరథ ఏఈ కళ్యాణ్ తెలిపిన వివరాల ప్రకారం.. డంపింగ్ యార్డులో దాదాపు వంద వాల్వ్‌లు మాయమైనట్లు తెలిపారు. వాటి విలువ దాదాపు రూ.10 లక్షల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వాల్వ్‌లు వేసేందుకు డంపింగ్ యార్డు వద్ద ఉన్న రూమ్‌ను తెరిచి చూడగా అవి కనిపించలేదు. దీంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హత్యాయత్నానికి పాల్పడిన ఒకరి రిమాండ్

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో శనివారం ఒకరిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని ఆదివారం రిమాండ్ చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొమ్మెన శశికాంత్ రూ.2 వేల విషయంలో అదే గ్రామానికి చెందిన సంగర్తి అరుణ్, అతని తల్లి సుగుణతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో గొడ్డలితో దాడి చేయగా సుగుణకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడు శశికాంత్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

దిగుబడి రాలేదని యువరైతు ఆత్మహత్య

బోథ్: సాగు చేసిన పంట ఆశించిన దిగుబడి రాలేదని పురుగుల మందు తాగి యువరైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని బాబెరలో చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం... బోథ్ మండలంలోని బాబెర గ్రామానికి చెందిన యువరైతు ఆత్రం భీమ్‌రావు (25) తనకున్న నాలుగెకరాల్లో ఈ ఏడాది పత్తి పంట సాగు చేశాడు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో శనివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సారూ.. జీతాలు వస్తలేవ్!

- రెండు నెలలుగా విడుదలకాని వేతనాలు
- ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు
- కుటుంబ పోషణ భారంగా మారిన వైనం



మంచిర్యాలలో ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు (ఫైల్)

జిల్లాల వారీగా సీఆర్పీల వివరాలు	
మంచిర్యాల	596
ఆదిలాబాద్	657
నిర్మల్	702
కుమురంభీం	519
మొత్తం	2,474

మంచిర్యాలఅర్బన్/లక్ష్మణచాంద: అసలే అరకొర వేతనాలు.. అవికూడా రెండు నెలలుగా ఇవ్వకపోవడంతో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్లకు పైగా సమగ్రశిక్షలో ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మండల, జిల్లా కార్యాలయాల్లో పలు కార్యక్రమాల అమలులో కీలకంగా వ్యవహరించే ఎయిడెడ్, సమగ్రశిక్ష, కేజీబీవీ, యూఆర్ఎస్, ఇతర పాఠశాలల ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో అనేక అవస్థలు పడాల్సి వస్తోంది.

ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు

ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీ సీఆర్టీలు, సీఆర్‌టీలు, ఏఎన్ఎం, అకౌంటెంట్‌లు, నాన్ టీచింగ్ సిబ్బంది, మండల, జిల్లా స్థాయిలో ఎంఐఎస్‌సీవో, సీసీవోలు, ఐఈఆర్పీలు, సీఆర్పీలు.. ఇలా పలు విభాగాల్లో మొత్తం 2,474 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి గతేడాదికి సంబంధించిన నవంబర్, డిసెంబర్ నెలల వేతనాలు నిలిచిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వచ్చే జీతాలు అంతంత మాత్రమే కావడంతో నెలవారీ ఖర్చులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి.

జీతాల చెల్లింపులు ఇలా..

సమగ్రశిక్ష అభియాన్ నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతంలో మంజూరు చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం తనవంతు వాటా చెల్లించినా రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా జమ చేయకపోవడంతోనే జాప్యం జరుగుతోందని ప్రచారంలో ఉంది. డీఈవో, ఎంఈవో కార్యాలయాల్లో సిబ్బందితో పాటు భవిత కేంద్రాల్లో, కేజీబీవీ, యూఆర్ఎస్‌లో విధులు నిర్వహించే ఉద్యోగులకు కనిష్టంగా నెలకు రూ.5,500 నుంచి రూ.25 వేల వరకు ప్రతినెలా పొందుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా విధులు నిర్వహిస్తున్నా ఇతర సదుపాయాలేమీ వారికి వర్తించడం లేదు.

మంచిర్యాల జిల్లాలో ..

మంచిర్యాల జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 596 మంది ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో కేజీబీవీలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది 424 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరి వేతనాలతో పాటు సరుకులు పంపిణీ చేసే గుత్తేదారులకు కూడా బడ్జెట్ మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. నెలల తరబడి బిల్లులు పేరుకుపోతుండడంతో గుత్తేదారులకు ఎలా చెప్పాలో అర్థంకాక ఎస్‌వోలు తలలు పట్టుకుంటున్నారు. వేతనాలతో పాటు డైస్ బిల్లులు కూడా చెల్లించాలని కోరుతున్నారు.

నిర్మల్ జిల్లాలో...

నిర్మల్ జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 702 మంది ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో డీపీవో సిబ్బంది 8 మంది, కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది 458 మంది, యూఆర్ఎస్ బోధన, బోధనేతర సిబ్బంది 13 మంది, ఎంఆర్సీ సిబ్బంది 180 మంది, ఎమ్మార్పీ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ 43 మంది కలిపి మొత్తంగా 702 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి నెలనెలా వేతనం రూ.5,500 నుండి రూ.32,500 వరకు ఉంది.

కుమురంభీం జిల్లాలో

కుమురంభీం జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మొత్తం 519 మంది ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో డీపీవో సిబ్బంది ఏడుగురు, కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది 362 మంది, ఎమ్మార్పీ సిబ్బంది 68 మంది, సీఆర్పీ, పీటీఐ సిబ్బంది 82 మంది విధులు నిర్వహిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న మాకు నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన వేతనాలు రావడం లేదు. దీంతో పాఠశాలకు రావడానికి ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– సౌజన్య, ఆర్ట్ టీచర్, జెడ్పీఎస్ఎస్, మన్మథ్, నిర్మల్

వేతనాలు విడుదల చేయాలి



రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వేతనాలు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– గంగాధర్, సీఆర్పీ, పల్సి, కుభీర్, నిర్మల్

వారంలోగా వచ్చే అవకాశం



జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో ఒప్పంద ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. కేంద్రం వాటా నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్రం వాటా విడుదల చేయకపోవడంతో వేతనాలు ఆగిపోయాయి. వారంలోగా నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

– రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

అటెండరే.. డాక్టర్ అయ్యాడు

- ఉడుంపూర్ వద్ద రోడ్డు ప్రమాదం
- సమయానికి ఆస్పత్రిలో లేని సిబ్బంది
- క్షతగాత్రులకు వైద్యం చేసిన అటెండర్



చికిత్స చేస్తున్న అటెండర్ వాజీద్

కడెం: అత్యవసర వేళ... ఆస్పత్రికి వస్తే సమయానికి వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో అటెండరే క్షతగాత్రులకు చికిత్స అందించి డాక్టరయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని వకీల్‌నగర్, డ్యాంగూడకు చెందిన ఆడ గంగాదేవి, లచ్చుపటేల్, ప్రభాకర్ ఆదివారం ద్విచక్ర వాహనంపై ఉట్నూర్ నుంచి కడెం బయలుదేరారు. ఉడుంపూర్ సమీపంలో ఎద్దు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడింది. ముగ్గురికి గాయాలు కావడంతో ఆటోలో కడెం పీహెచ్‌సీకి తరలించారు. ఆస్పత్రిలో సిబ్బంది లేకపోవడంతో అటెండర్ వాజీద్ ఇంజక్షన్‌లు ఇచ్చి చికిత్స చేశారు. మెరుగైన చికిత్స కోసం 108లో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగి సకాలంలో వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

కాగజ్‌నగర్‌రూరల్: నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1కు చెందిన రాజ్‌సర్కార్ ఆదివారం గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు. విలేజ్ నెం.3 గ్రామానికి చెందిన రాహుల్ మండల్ వద్ద 30 గ్రాముల గంజాయిని కొనుగోలు చేశాడని తెలిపారు. రాహుల్ మండల్ పరారీలో ఉన్నాడన్నారు.

బాలికపై హెచ్‌ఎం లైంగిక వేధింపులు

- పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ గురువు సభ్య సమాజం తలదించుకునే విధంగా ప్రవర్తించాడు. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మావల మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఈ సంఘటన చోటు చేసుకుంది. రెండు మూడు రోజుల క్రితం పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన చాంబర్‌కు పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు విద్యార్థిని తల్లిదండ్రులకు తన గోడు వెల్లబోసుకుంది. కొన్ని రోజులుగా తనతో అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని కంటతడిపెట్టింది. సదరు విద్యార్థిని ఇదే పాఠశాలలోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో ఆదివారం మావల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విద్యార్థినిని పిలిచి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సైతం పిలిపించారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు ఇచ్చినా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

గతంలో..

లైంగిక వేధింపులతో ఈ పాఠశాల తరచూ తెరకెక్కుతోంది. గతంలో సైతం పాఠశాలలో పనిచేసే వార్డెన్ బాలుడిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పడంతో అప్పట్లోనూ మావల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన సంఘటన తెలిసిందే. ఆ పాఠశాల యాజమాన్యం వార్డెన్‌ను తొలగించింది. మరోమారు ఘటన పునరావృతం కావడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: మావల శివారులోని ఓ పాఠశాల హెచ్‌ఎం మోహన్‌రావుపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. విద్యార్థినిపై లైంగిక దాడిని నిరసిస్తూ ఆదివారం పాఠశాల ఎదుట నిరసన తెలిపా రు. వెంటనే రిమాండ్‌కు తరలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, నిఖిల్, ఉదయ్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

పాత మద్దిపడగలో 'ఊరు కట్టుడు'



పాత మద్దిపడగలో ఊరు కట్టుడు కార్యక్రమం

కడెం: ఊరి క్షేమం కోసం సాధారణంగా అన్ని గ్రామాల్లో అనాదిగా వస్తున్న ఆచారం ఊరు కట్టుడు. కడెం మండలంలోని పాత మద్దిపడగలో ఊరు కట్టే రోజు నుంచి తెల్లవారి పూజలు ముగిసే వరకు గ్రామస్తులెవరూ ఊరు దాటి వెళ్లకుండా, ఇతర గ్రామాల వారు గ్రామంలోకి రాకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటారు. గ్రామానికి నలువైపులా పొలిమేర వద్ద గ్రామస్తులు కాపాలా ఉంటారు. పెద్ద పండుగగా పిలుచుకునే ఈ కార్యక్రమం శనివారం రాత్రి ప్రారంభమై ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు సార్గమ్మను పూజిస్తారు.

మాలీలు అన్నిరంగాల్లో రాణించాలి

- అఖిల భారతీయ మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే



నాగ్‌పూర్ సభలో పాల్గొన్న సుకుమార్ పేట్కులే

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల స్ఫూర్తితో మాలీ కులస్తులు అన్నిరంగాల్లో రాణించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఆదివారం కోసరే మాలీ సంఘటన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పూలే దంపతుల జీవిత చరిత్రను ప్రతీ మాలీ బిడ్డ చదివి వారి అడుగుజాడల్లో నడవాలని, సామాజిక న్యాయం కోసం పోరాటాలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు మాలీ సంఘం నేతలు పాల్గొన్నారు.

అంటు మొక్కలు C/O భీమారం

- 200 కుటుంబాలకు ఉపాధి
- రాష్ట్ర వ్యాప్తంగా మొక్కల సరఫరా
- నాణ్యమైనవిగా రైతుల నమ్మకం
- మార్కెటింగ్ సదుపాయం కావాలని వినతి



భీమారం నర్సరీలో పెద్ద మామిడి అంటుమొక్కలు

భీమారం: తియ్యటి పండ్లు అందించే మామిడి తోటల వ్యాప్తికి కీలకమైన మామిడి అంటు మొక్కల నర్సరీలకు భీమారం కేరాఫ్‌గా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందింది. 40 ఏళ్ల క్రితం ప్రముఖ సంఘ సేవకుడు దివంగత ఎన్వీ.రాజారెడ్డి భీమారంలో ఐటీడీఏ ద్వారా అంటు మొక్కల నర్సరీకి తన భూమిని విరాళంగా ఇచ్చాడు. అంటు మొక్కల ఉత్పత్తికి నాంది పలికారు. అది ఇప్పుడు కుటీర పరిశ్రమగా మారింది. మండలంలోని భీమారం, అంకుసాపూర్, తాళ్లగూడెంలోని గిరిజన, దళిత కుటుంబాల రైతులు మొక్కల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఏటా దాదాపు 3 లక్షల మొక్కల వరకు అంటుకట్టి ఏడాది తర్వాత రైతులకు విక్రయిస్తున్నారు.

మొదట ప్రభుత్వపరంగా

దాదాపు 40 ఏళ్ల క్రితం ఐటీడీఏ ద్వారా భీమారంలో ఏర్పాటు చేసిన అంటుమొక్కల నర్సరీల్లో మామిడి మొక్కలకు అంటుకట్టే పద్ధతికి శ్రీకారం చుట్టారు. ఇందులో చెన్నూరు ప్రాంతంలోని వివిధ గ్రామాల గిరిజనులకు భీమారానికి రప్పించి అంటుకట్టడంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఒకవైపు శిక్షణ ఇస్తూనే మరోవైపు ఐటీడీఏ నర్సరీల్లో లక్షలాది మొక్కలు ఉత్పత్తి చేయడం ప్రారంభించింది. ఇక్కడి మొక్కలు ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సరఫరా చేసేవారు.

ప్రైవేటుకు ప్రోత్సాహం

ప్రభుత్వం ఐటీడీఏ నర్సరీతో పాటు అందులో శిక్షణ పొందిన గిరిజన, దళితులకు బ్యాంకు రుణాలు ఇప్పించి ప్రైవేట్‌గా మామిడి అంటు మొక్కల నర్సరీలను విస్తరించింది. దీంతో అనేక మంది యువకులు నర్సరీలు పెంచుకోవడం ప్రారంభించారు. అయితే అందులో పెంచిన మొక్కలను తిరిగి ప్రభుత్వం కొనుగోలు చేసి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేసేవారు. దీంతో అనేక కుటుంబాలు నర్సరీలపై ఆధారపడ్డారు.

నిలిపివేతతో ఇబ్బంది..

దాదాపు 20 ఏళ్లక్రితం ఐటీడీఏ గిరిజన, దళిత రైతులు వారి నర్సరీల్లో పెంచిన మొక్కలను కొనుగోలు చేయడాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన భీమారం మొక్కలకు డిమాండ్ అధికంగా ఉండటంతో వివిధ జిల్లాల నుంచి రైతులే స్వయంగా వచ్చి ప్రైవేట్ నర్సీల్లో కొనుగోలు చేయడం ప్రారంభించారు. దాదాపు 200 కుటుంబాలు ఇదే వృత్తిని నమ్ముకుని ఇప్పటికీ అంటు పద్ధతిలో మొక్కలు పెంచి విక్రయిస్తున్నాయి. వీటిని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్‌కు సరఫరా చేస్తున్నారు.

మొక్కల రకాలు

మామిడి మొక్కల పెంపకం ద్వారా ఉపాధి పొందుతున్న నర్సరీలో రైతుల డిమాండ్ మేరకు వివిధ రకాలు పెంచుతున్నారు. ముఖ్యంగా బంగినపల్లి, దసేరి, మల్లిక, కొత్తపల్లి కొబ్బరి రకాల అంట్లు తీసుకువచ్చి మొక్కలు తయారీ చేస్తున్నారు. వీటి ధర రూ.100 నుంచి 150 వరకు పలుకుతోంది.

ఒక్కో నర్సరీలో..

వ్యవసాయ భూములను లీజుకు తీసుకుని ఒక్కో గిరిజన, దళిత రైతు వెయ్యి నుంచి 3 వేల వరకు మొక్కలు పెంచుతున్నారు. జనవరి వరకు అవసరమైన అంటుని మామిడి తోటల్లో సేకరించి దానిని తల్లిమొక్కకు అంటు కట్టడం చేస్తారు. సంవత్సరం పెరిగిన అనంతరం రైతులకు విక్రయిస్తారు.

అమ్మకానికి 3 లక్షల మొక్కలు

మండలంలోని నర్సరీల్లో 3 లక్షల మామిడి అంటు మొక్కలు అమ్మకానికి ఉన్నాయి. గత సంవత్సరం వర్షాకాలంలో అనుకున్న స్థాయిలో మార్కెటింగ్ కాలేదు. దీనితో గతేడాదితో పాటు ఈసారి కలిపి 3 లక్షలకు చేరుకున్నాయి.

ఆయిల్‌పాం తోటలతో నష్టాలు..

నేను 20 ఏళ్ల నుంచి నర్సరీలో మామిడి మొక్కలు పెంచుతున్నా. రెండేళ్ల నుంచి చాలా మంది రైతులు ఆయిల్‌పాం సాగుకు మొగ్గు చూపుతున్నారు. దీని ప్రభావం మామిడి మొక్కల విక్రయాలపై పడింది. అమ్మకాలు తగ్గిపోయాయి.

– సెగ్యం తిరుపతి, నర్సరీ రైతు, భీమారం

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి

గతంలో మాదిరిగా మామిడి మొక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేసి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. దీంతో నర్సరీలు పెంచుతున్న వారికి భరోసా ఏర్పడుతుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– గోమాత శేఖర్, నర్సరీ రైతు, అంకుసాపూర్

పురుగుల మందు తాగి వలస కూలీ మృతి



కుంచపు గణేశ్ మృతదేహం

లోకేశ్వరం(ముధోల్): పురుగుల మందు తాగి వలస కూలీ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కుభీర్ మండలంలోని పల్సి గ్రామానికి చెందిన కుంచపు గణేశ్ (40) తొమ్మిదేళ్ల క్రితం లోకేశ్వరం మండలంలోని పోట్‌పల్లి గ్రామానికి వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం వలస వచ్చాడు. అప్పటి నుంచి గ్రామంలోనే పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య శోభ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

- రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు
- ఆపరేషన్ చేయాలని వైద్యుల సూచన
- ఆందోళనలో నిరుపేద కుటుంబం

దాతలు సాయం చేయాల్సిన నంబర్లు
మోర్లె పాండురంగ్, ఫోన్‌పే,
గూగులే పే నంబర్ 8317507539
అకౌంట్ నంబర్ 62319443930,
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0061739,
బ్రాంచీ: ఎస్‌బీఐ కౌటాల.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకర్

కౌటాల: రెక్కాడితే కాని డొక్కాడని ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం కష్టాలు తెచ్చిపెట్టింది. వివరాల్లోకి వెళ్తే..కౌటాల మండలంలోని గురుడుపేటకు చెందిన నికొడే శంకర్, లావణ్య దంపతులకు మూడేళ్ల కుమార్తె మేఘన, నాలుగు నెలల కుమారుడు హర్షిత్ ఉన్నారు. రోజు కూలీ పనిచేస్తేనే ఆ కుటుంబం గడుస్తుంది. ఈ నెల 5న శుక్రవారం ఉదయం శంకర్ కూలీ పనుల నిమిత్తం బైక్‌పై కౌటాలకు వెళ్లివస్తుండగా యాపలగూడ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలు కావడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన కరీంనగర్‌కు తరలించారు. బ్రెయిన్ ఆపరేషన్ చేయాలని, రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు సూచించారు. దీంతో నిరుపేదలైన ఆ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కూలీ పనులకు వెళ్తేగాని కుటుంబ పోషణ గడవని పరిస్థితుల్లో అంత డబ్బు ఎలా సమకూర్చాలో తెలియక కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దాతలు, పాలకులు సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నా భర్తను కాపాడండి



మూడు రోజుల క్రితం నా భర్త నడుపుతున్న బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. తలకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించాం. బ్రెయిన్ ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. చేతిలో చిల్లిగవ్వ లేదు. దాతలు, పాలకులు స్పందించి ఆదుకోవాలి. నా భర్తకు ప్రాణం పోయాలి.

– నికొడే లావణ్య, శంకర్ భార్య, గురుడుపేట